

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికింది.



మామ అండ.. అల్లుడి దందా!

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు చేశారు.

8లో

గరిష్టం/కనిష్టం

40.2°/22.5°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

డీఎస్పీల బదిలీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు కర్నూలు జిల్లా పత్తికొండకు, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ గంగయ్య తాడిపత్రికి, తాడిపత్రి డీఎస్పీ చైతన్య రాజంపేటకు బదిలీ అయ్యారు. రాజమండ్రి డీఎస్పీ శ్రీలతను కదిరికి, వైఎస్సార్ జిల్లా ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్‌ను హిందూపురం డీఎస్పీగా, వైఎస్సార్ జిల్లా దిశ డీఎస్పీ వాసుదేవన్‌ను పుట్టపర్తి డీఎస్పీగా నియమించారు. అనంతపురం డీఎస్పీ ప్రసాదరావు చీరాలకు, అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వీర రాఘవరెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం డీఎస్పీగా నియమితులయ్యారు. కదిరి డీఎస్పీ భవ్యకిషోర్ రేణిగుంటకు, పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ చంద్రగిరికి బదిలీ అయ్యారు. పుట్టపర్తి ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డిని జమ్మలమడుగుకు, అనంతపురం సీసీఎస్ డీఎస్పీ మహబూబ్‌బాషాను రాయచోటి డీఎస్పీగా బదిలీ చేశారు.

1 నుంచి తిరుపతిలో సీఎం కప్ క్రీడా పోటీలు



అనంతపురం సప్తగిరి సర్కిల్: తిరుపతిలో మే 1 నుంచి 5 వరకు తిరుపతి వేదికగా సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో 14 క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29లోపు ఆధార్, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 30న క్రీడా దుస్తులను, టీఏ, డీఏలను అందించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 08554-353223 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

1 నుంచి వేసవి సెలవులు

- జూన్ 12న స్కూళ్లు పున:ప్రారంభం
- సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న పాఠశాలలకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 30 చివరి పని దినం. మే 1 నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. వాస్తవానికి 30 ఆదివారం. అయితే పదో తరగతి పరీక్షల కేంద్రాలుగా ఉన్న స్కూళ్లకు ఆ సమయంలో సెలవు ఇవ్వడంతో 30న ఆయా స్కూళ్లు పెట్టుకోనున్నారు. తక్కిన స్కూళ్లకు మాత్రం 29వ తేదీనే లాస్ట్ వర్కింగ్ డే అని డీఈఓ సాయిరామ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు మే 1 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు విధిగా పాటించాలని ఆదేశించారు. జూన్ 12న పాఠశాలలు పున:ప్రారంభమవుతాయన్నారు. వేసవి సెలవుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలు నడపరాదని స్పష్టం చేశారు. పదో తరగతి ప్రత్యేక తరగతులు, శిక్షణలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై చర్యలుంటాయని హెచ్చరించారు.

కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

అనంతపురం: పాలనా సౌలభ్యం రీత్యా కృష్ణా నీటి యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం నార్పలలో సీఎంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కృష్ణా బేసిన్‌కు సంబంధించిన వ్యవహారాల నిర్వహణకు కర్నూలు అత్యుత్తమ ప్రదేశమని పేర్కొన్నారు. అలాగే ఇదే అంశంపై అపెక్స్ కౌన్సిల్, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న ప్రయత్నాలను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి కొనియాడారు. ప్రస్తుతం బోర్డు ఏర్పాటు చేసిన విశాఖకు కృష్ణా నదికి ఎలాంటి సంబంధం లేదని, బోర్డు నిర్వహణను కర్నూలులో ఏర్పాటు చేయడం ఉత్తమమని విన్నవించారు. గంగపుత్రులకు చట్టసభల్లో స్థానం కల్పించాలని ఏపీ బెస్త వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ కోరారు.



నార్పలలో 'జగనన్న వసతి దీవెన' బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నీరాజనం

- అన్ని దారులూ నార్పల వైపే
- మిన్నంటిన 'జై జగన్' నినాదాలు
- సీఎం ప్రసంగం ఆద్యంతం చప్పట్ల హోరు

అనంతపురం: శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రం వేదికగా బుధవారం 'జగనన్న వసతి దీవెన' సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమం విజయవంతమైంది. సీఎం హోదాలో మొదటిసారి విచ్చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విశేష ప్రజాదరణ లభించింది. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మహిళా సంఘాల సభ్యులు, శింగనమల, నార్పల, యల్లనూరు, పుట్లూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల నుంచే కాకుండా అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్ని దారులూ నార్పలవైపే సాగాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే జనం సభా వేదిక వద్దకు చేరుకోవడం మొదలైంది. 10 గంటలకల్లా గ్యాలరీలు నిండిపోయాయి. సభా ప్రాంగణం బయట మూడింతల జనం నిల్చుండిపోయారు. అధికారులు సీఎం ప్రసంగం కోసం ఎల్‌ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు.

హోరెత్తిన నినాదాలు

నార్పల పరిసరాలు 'జై జగన్' నినాదాలతో మిన్నంటాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి ఎయిర్‌పోర్టు నుంచి నార్పలకు హెలికాప్టర్‌లో వచ్చారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, కలెక్టర్ ఎం.గౌతమి, డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, సహాయ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట హెలికాప్టర్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వచ్చారు. సభావేదిక మీద ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సీఎం నివాళులర్పించి సభను ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం సీఎం జగన్‌ను ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, శింగనమల నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సీఎం పర్యటన విజయవంతంగా ముగియడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది.

కరుణించిన వరుణుడు

బహిరంగ సభ ప్రారంభానికి రెండు గంటల ముందు వరుణ దేవుడు కరుణించాడు. ఓ మోస్తరు వర్షం పడడంతో పరిసర ప్రాంతాలు చల్లగా మారాయి. సీఎం జగన్ ఎక్కడ సమావేశం పెట్టినా... వరుణ దేవుడు వచ్చి పలుకరించి వెళ్తాడనడానికి నార్పల బహిరంగ సభే నిదర్శనం. జనం సీఎం ప్రసంగం ఆసాంతం కదలకుండా విన్నారు. ప్రసంగం ఆద్యంతం ఈలలు, చప్పట్లతో హోరెత్తింది. పంచతంత్రం కథ ఆకట్టుకునేలా చెప్పడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. సీఎం ..సీఎం అంటూ నినాదాలు చేశారు. థ్యాంక్యూ మామయ్య అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. సభకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ వాటర్ బాటిల్, స్నాక్స్, జ్యూస్ అందించారు. అలాగే అనంతపురం, బత్తలపల్లి, తాడిపత్రి, నార్పల వైపు వెళ్లే రోడ్లలో ప్రతి 50 అడుగుల దూరంలో వాటర్ ప్యాకెట్లు అందించారు.

ఆత్మీయ వీడ్కోలు

జగనన్న వసతి దీవెన కార్యక్రమం ముగించుకున్న తర్వాత బుధవారం మధ్యాహ్నం నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఆత్మీయ వీడ్కోలు లభించింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు ప్రతి ఒక్కరి నుంచి పూల బొకేలు స్వీకరిస్తూ ఆప్యాయంగా పలకరించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారందరితోనూ దాదాపు గంటన్నరపాటు సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా 23 మంది తమ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రాలు అందజేశారు. వీరిలో 19 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు. కలెక్టర్ గౌతమిని పిలిపించి ముగ్గురి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వారందరి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- వేదిక మీద జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, కేవీ ఉషశ్రీ చరణ్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, పోతుల సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్/ఎమ్మెల్సీ తలశిల రఘురాం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, నార్పల సర్పంచ్ సుప్రియ, జెడ్పీవైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, అనంతపురం మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్సీ శమంతమణి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథరెడ్డి, అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బాలనాగి భాగ్యలక్ష్మి, తదితరులు ఆసీనులయ్యారు.



జగనన్న వసతి దీవెన సొమ్మును బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగనన్న విద్యారత్నాలు పేరిట జ్ఞాపికను సీఎం జగన్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల నియోజకవర్గానికి వరాల జల్లు

అనంతపురం/శింగనమల/ నార్పల: శింగనమల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి విన్నవించగా సీఎం వెంటనే ఆమోదం తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.

- చాగల్లు రిజర్వాయర్ ముంపు గ్రామాలైన ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.168 కోట్లు మంజూరు.
- ఈస్ట్ నరసాపురంలో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.35 కోట్ల కేటాయింపునకు ఆమోదం.
- శింగనమల మండల కేంద్రంలో రూ.2 కోట్ల నిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ఆమోదం.
- మిడ్‌పెన్నార్ డ్యాం నిర్వహణ నిమిత్తం రూ.3 కోట్ల నిధులు విడుదల.
- నార్పల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 800 మంది విద్యార్థినులు ఉన్నారు. పాఠశాల నిర్వహణకు రెండు ఎకరాలు కావాలని కోరగా, ఇందుకు కోటి రూపాయల నిధులు కేటాయిస్తూ సీఎం ఆమోదం.
- చిత్రావతి నది మీద యల్లనూరు మండలంలో కేడీ రోడ్డు నుంచి చింతకాయమందకు రాకపోకల నిమిత్తం రూ.11.75 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం.
- చిత్రావతి నది మీద కోడుమూర్తి నుంచి చిలమకూరు వరకు రూ.15 కోట్ల వ్యయంతో కాజ్‌వే నిర్మాణానికి అంగీకారం.
- పుట్లూరు, యల్లనూరు మండలాల ప్రజలు పులివెందుల నియోజకవర్గానికి ఆనుకుని ఉండడం వల్ల పులివెందులను కూడా తమ సొంత నియోజకవర్గంలా భావిస్తుంటారు. పుట్లూరు మండలంలో సాగు, తాగునీరు సమస్యను పరిష్కరించడానికి గండికోట రిజర్వాయర్ నుంచి సుబ్బరాయసాగర్ ట్యాంక్‌కు లిఫ్ట్ ద్వారా నీరందించే పథకానికి రూ.250 కోట్లు మంజూరు.

ఉన్నత విద్యావంతులను చేయడమే లక్ష్యం

ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఎంతోమంది పేద విద్యార్థులకు భోజన, వసతి భారం తల్లిదండ్రుల మీద పడకుండా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ 'జగనన్న వసతి దీవెన' ద్వారా అందజేస్తున్నారని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. నార్పలలో నిర్వహించిన వసతి దీవెన కార్యక్రమం బహిరంగ సభను కలెక్టర్ స్వాగతోపన్యాసం చేశారు. ఐటీఐ నుంచి పీహెచ్‌డీ వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతులు వసతి దీవెన పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,55,662 మంది పేద విద్యార్థులకు రూ.912.71 కోట్లు వారి తల్లుల ఖాతాల్లో జమ కానుందన్నారు. అనంతపురం జిల్లాకు చెందిన 40 వేల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.39.92 కోట్లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఇలాంటి పథకాలు లేకనిన్న, మొన్నటి తరానికి చెందిన పేదలు ఉన్నత చదువులకు దూరం అయ్యారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా..

- **ఉదయం 10** గంటలకు సీఎం జగన్ శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.
- **ఉదయం 10:30** గంటల వరకు శ్రీసత్యసాయి జిల్లా ఎమ్మెల్యేలతో మాట్లాడారు.
- **ఉదయం 10:50** గంటలకు నార్పల ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- **ఉదయం 10:50 నుంచి 11:20** గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.
- **ఉదయం 11:25కు** నార్పల క్రాస్‌వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు.
- **ఉదయం 11:30కు** ఫొటో గ్యాలరీని తిలకించారు. అక్కడే ఉన్న విద్యార్థులతో సరదాగా ముచ్చటించి గ్రూపు ఫొటో తీసుకున్నారు.
- **ఉదయం 11:40కు** వేదికపై వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- **ఉదయం 11:45కు** కలెక్టర్ ఎం.గౌతమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు.
- **ఉదయం 11:50కు** శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రసంగించారు.
- **మధ్యాహ్నం 12** గంటలకు విద్యార్థులతో మాటామంతి.
- **మధ్యాహ్నం 12:20కు** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ప్రారంభం.
- **మధ్యాహ్నం 1:10కు** జగనన్న వసతి దీవెన పథకం నిధులను బటన్ నొక్కి నేరుగా తల్లుల ఖాతాల్లో జమ.
- **మధ్యాహ్నం 1:15కు** సీఎం జగన్‌కు సత్కారం.
- **మధ్యాహ్నం 1:25కు** బహిరంగసభ ముగింపు.
- **మధ్యాహ్నం 3:45** వరకు ఎమ్మెల్యేల తో సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరి నుంచి పూల బొకేలు, వినతిపత్రాలు స్వీకరించారు.
- **సాయంత్రం 4**గంటలకు సాంకేతిక లోపం కారణంగా హెలికాప్టర్ మొరాయించడంతో రోడ్డుమార్గాన పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు.
- రోడ్డు మార్గాన వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు పూల వర్షం కురిపించారు.



నార్పల మండల కేంద్రంలో సీఎం వైఎస్ జగన్‌ను చూసి అభివాదం చేస్తున్న ప్రజలు



వసతిదీవెన సొమ్ము విడుదల సందర్భంగా విజిల్స్ వేస్తున్న విద్యార్థులు



బహిరంగసభకు జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ వస్తున్న విద్యార్థులు

రెండింటా బాలికలే!

- ఇంటర్ ఫలితాల్లో హవా..
- జూనియర్ ఇంటర్‌లో ఉమ్మడి జిల్లాకు 7వ స్థానం
- సీనియర్ ఇంటర్‌లో 9వ స్థానం
- గతేడాదికంటే మెరుగైన ఫలితాలు
- ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి విడుదల

రాప్తాడు రూరల్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. మార్చి 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 4న ముగిశాయి. ఫలితాల విడుదల సమాచారం ఒకరోజు ముందే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు విడుదలవుతాయని తెలియడంతో అందరూ సెల్‌ఫోన్లు పట్టుకుని ఎదురుచూశారు. ఎట్టకేలకు ఒక గంట ఆలస్యంగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఫలితాలను విడుదల చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానం గతేడాదికంటే మెరుగుపడింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 7వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 9వ స్థానాన్ని దక్కించుకుంది.

జూనియర్ ఇంటర్‌లో 57 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లా 57 శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాది 46 శాతానికి సరిపెట్టుకోగా ఈసారి 11 శాతం పెరిగింది. మొత్తం 25,249 మంది విద్యార్థులకు గాను 14,504 మంది పాసయ్యారు. వీరిలో 11,566 మంది బాలురకు గాను 6,061 మంది (52 శాతం), 13,683 మంది బాలికలకు గాను 8,443 మంది (62 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ కళాశాలల్లో 956 మందికి గాను 332 మంది ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూళ్లలో 1,268 మందికి గాను 494 మంది పాసయ్యారు.

- ప్రైవేట్ కళాశాలల్లో 17,677 మంది విద్యార్థులకు గాను 11,093 మంది ఉత్తీర్ణత సాధించారు. బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 482 మందికి గాను 410 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో 123 మంది విద్యార్థులకు గాను 65 మంది ఉత్తీర్ణత సాధించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 876 మంది విద్యార్థులకు గాను 586 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 611 మందికి గాను 145 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీ రెసిడెన్షియ్ జూనియర్ కళాశాలల్లో 115 మందికి గాను 88 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

చిలమత్తూరు ఫస్ట్...బెళుగుప్ప లాస్ట్

ఇంటర్ మొదటి సంవత్సరం (జనరల్) ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చిలమత్తూరు కళాశాల టాప్‌లో నిలవగా బెళుగుప్ప కళాశాల లాస్ట్‌లో నిలిచింది. చిలమత్తూరు కళాశాలలో 40 మందికి గాను 28 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రామగిరి 36 మందికి గాను 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రెండోస్థానం, బొమ్మనహాళ్ జూనియర్ కళాశాల 101 మంది విద్యార్థులకు గాను 63 మంది ఉత్తీర్ణత సాధించి మూడోస్థానంలో నిలిచింది. చివరిస్థానంలో ఉన్న బెళుగుప్ప కళాశాలలో 15 మందికి గాను ఒకే ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించాడు.

సీనియర్ ఇంటర్‌లో 67 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లోనూ గతేడాదికంటే మెరుగైంది. గతేడాది 55 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 12 శాతం అంటే 67 శాతానికి చేరుకుంది. మొత్తం 25,126 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16,943 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 11,609 మంది బాలురకు గాను 7,278 మంది (63 శాతం), 13,519 మంది బాలికలకు గాను 9,665 మంది (72 శాతం) పాసయ్యారు. కేజీబీవీ కళాశాలల్లో 596 మందికి గాను 362 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూళ్లలో 1,396 మందికి గాను 695 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ కళాశాలల్లో 17,416 మంది విద్యార్థులకు గాను 12,171 మంది ఉత్తీర్ణులయ్యారు. బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 425 మందికి గాను 392 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో 115 మంది విద్యార్థులకు గాను 65 మంది ఉత్తీర్ణత సాధించారు. సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల్లో 989 మంది విద్యార్థులకు గాను 748 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 612 మందికి గాను 227 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 130 మందికి గాను 107 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

బొమ్మనహాళ్ జూనియర్ కళాశాల టాప్

ద్వితీయ సంవత్సరం (జనరల్) ఫలితాల్లో బొమ్మనహాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల టాప్‌లో నిలిచింది. 196 మంది విద్యార్థులకు గాను 160 మంది ఉత్తీర్ణత సాధించారు. మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. 116 మంది విద్యార్థులకు గాను 79 మంది ఉత్తీర్ణత సాధించారు. రామగిరి జూనియర్ కళాశాల మూడోస్థానంలో నిలిచింది. ఇక్కడ 55 మంది విద్యార్థులకు గాను 37 మంది ఉత్తీర్ణత సాధించారు. చివరి స్థానాల్లో బెళుగుప్ప, ముదిరెడ్డిపల్లి కళాశాలలు నిలిచాయి. బెళుగుప్ప కళాశాలలో 22 మందికి గాను ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించగా, ముదిరెడ్డిపల్లి కళాశాలలో పరీక్ష రాసిన ఒక్క విద్యార్థీ ఫెయిల్ అయ్యాడు.



టమాట కిలో గరిష్ట ధర రూ.5



అనంతపురం అగ్రికల్చర్: కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 పలికింది. మార్కెట్‌కు 11 టన్నులు అమ్మకానికి వచ్చాయని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

ప్రమాదంలో వివాహిత మృతి


పుష్పావతి(ఫైల్)

కళ్యాణదుర్గం: కర్నూలు జిల్లాలో చోటు చేసుకున్న ప్రమాదంలో కళ్యాణదుర్గానికి చెందిన ఓ వివాహిత మృతి చెందింది. బంధువులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దికు చెందిన విజయ్, పుష్పావతి (30) దంపతులకు కుమార్తె దీప, కుమారుడు నిషాంత్ ఉన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో మెడికల్ రెప్రెంజెటేటివ్‌గా పనిచేస్తున్న విజయ్.. కుటుంబసభ్యులతో కలసి హైదరాబాద్‌లోనే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో కూడేరు మండలం చోళసముద్రంలో బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చిన వారు... మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో కర్నూలు జిల్లా పెరవళిలో నివాసముంటున్న పుష్పావతి తల్లిదండ్రులను పలకరించి, రాత్రికి తమ ప్రయాణం కొనసాగించారు. కర్నూలు జిల్లాలోకి చేరుకోగానే కారు ప్రమాదానికి గురైంది. ఘటనలో పుష్పావతి అక్కడికక్కడే మృతి చెందింది. స్వల్ప గాయాలతో విజయ్ బయటపడ్డాడు. చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఒంటిమిద్దిలోని కుటుంబసభ్యులు బోరున విలపించారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత 'అనంత'

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా వేదికగా నిర్వహించిన సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ టోర్నీ చాంపియన్ షిప్‌ను అనంతపురం జిల్లా సీనియర్ జట్టు దక్కించుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ జట్టుపై 1 వికెట్ తేడాతో విజయం సాధించింది. ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగిన టోర్నీలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు ఫైనల్స్‌కు చేరాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వైఎస్సార్ జిల్లా జట్టు 18.1 ఓవర్లలో 155 పరుగుల వద్ద కుప్పకూలింది. జట్టులో వంశీకృష్ణ 31, నరేన్‌రెడ్డి 29, హరిశంకరరెడ్డి 29 పరుగులు సాధించారు. అనంత బౌలర్లలో దీపక్, షోయబ్ మహమ్మద్‌ఖాన్ చెరో 3 వికెట్లు, సంతోష్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 18.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో రాజకుళ్లాయప్ప 42, గిరినాథ్‌రెడ్డి 26, సంపత్‌కుమార్ 24, వినయ్‌కుమార్ 20 పరుగులతో రాణించారు.

జననేతకు ఘన స్వాగతం

సాక్షి బృందం, అనంతపురం: నార్పలలో 'జగనన్న వసతి దీవెన' సభకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. జిల్లా మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, గురునాథరెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. కాగా, పుట్టపర్తిలోని విమానాశ్రయంలో సీఎం జగన్‌కు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వాగతం పలికారు.


సీఎం జగన్‌ను చూసేందుకు నార్పలలో రోడ్డుకిరువైపులా ఉన్న జనం


చిన్నారితో కలసి సీఎం సభకు వచ్చిన తల్లి


సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తదితరులు


జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్ గార్గ్, వివిధ శాఖల జిల్లా అధికారులు



సీఎంను స్వాగతిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు, బొకే అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య





అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, ఏపీసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


ఎమ్మెల్సీ శివరామిరెడ్డి


జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


డీఐజీ అమ్మిరెడ్డి


ఎస్పీ కంచి శ్రీనివాసరావు




మాజీ ఎమ్మెల్యేలు వై.విశ్వేశ్వరరెడ్డి, గురునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు రమేష్‌గౌడ్, వెన్నపూస రవీంద్రారెడ్డి


సభలో ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్, వేదికపై ఆసీనులైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

వాహనం ఢీకొని బాలుడి మృతి


మృతుడు అర్మాన్

గుంతకల్లు టౌన్: వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హైదరాబాద్‌లోని బోయినపల్లిలో నివాసముంటున్న సైనికోద్యోగి నూర్‌బాషా, హసీనాబేగం దంపతులు తమ ఒక్కగానొక్క కుమారుడు షేక్ అర్మాన్ బాషా (17)తో కలసి రంజాన్ పండుగను కుటుంబసభ్యులతో కలసి జరుపుకునేందుకు ఇటీవల గుంతకల్లుకు వచ్చారు. బుధవారం తండ్రితో కలసి కొనకొండ్ల రోడ్డులోని స్విమ్మింగ్‌పూల్ వద్దకు ఈత కొట్టేందుకు అర్మాన్‌బాషా వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం ఇద్దరూ వేర్వేరు ద్విచక్ర వాహనాల్లో ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో బుల్లెట్ వాహనాన్ని నడుపుతున్న అర్మాన్‌బాషాను హనుమాన్ జంక్షన్ వద్దకు చేరుకోగానే బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అర్మాన్‌బాషా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనకు సంబంధించి మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని వన్‌టౌన్ ఎస్‌ఐ మురహరి తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో 'బెస్ట్' సత్తా


భార్గవి

రాప్తాడు రూరల్ : అనంతపురం నగర శివారులోని వడియంపేట వద్ద ఉన్న బెస్ట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటారు. ఫలితాలు బుధవారం విడుదయ్యాయి. ఇందులో కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థినులు బి.ప్రణవిక 1000 మార్కులకు 984, సి. భార్గవి 967 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అలాగే, సీఈసీలో సమీరా 1000కి 910, ఎంఈసీలో స్రవంతి 896, బైపీసీలో అజయ్ 946, ఎమ్. మధురిమ 932 మార్కులతో సత్తా చాటారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

పట్టపగలే చోరీ

కదిరి టౌన్: పట్టపగలే ఓ ఇంట్లో ఓ దుండగుడు చొరబడి విలువైన బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరిలోని బండారు నగర్‌లో నివాసముంటున్న చిన్నారెడ్డి దంపతులు డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 10.15 గంటలకు ఇంటికి తాళం వేసి, చిన్నారెడ్డి క్లినిక్‌కు వెళ్లాడు. విషయాన్ని గమనించిన దుండగుడు ఇంటి తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 35 తులాల బంగారు నగలు, రూ.1.60 లక్షల నగదు అపహించుకెళ్లారు. మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వచ్చిన దంపతులు చోరీ విషయం గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన పది 'స్పాట్'


స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన జవాబుపత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

రాప్తాడు రూరల్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యంకనం (స్పాట్) బుధవారం ముగిసింది. ఈ నెల 19న అనంతపురంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. మొత్తం 2,09,928 జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయి. తెలుగు, హిందీ, సైన్స్, సోషల్ సబ్జెక్టుల మూల్యాంకనం నిర్దేశించిన గడువు కంటే ఒక రోజు ముందే పూర్తయ్యాయి. ఇంగ్లిష్, గణితం, సంస్కృతం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పూర్తయ్యాయి. తక్కువ పేపర్లు ఉండడంతో చివరి రోజు ఒక్కో టీచరుకు గరిష్ఠంగా 20 పేపర్లు ఇచ్చారు. స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన జవాబుపత్రాలను మూల్యాంకన కేంద్రం క్యాంపు ఆఫీసరు, డీఈఓ సాయిరామ్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ (స్ట్రాంగ్‌రూం) గోవిందునాయక్ పరిశీలించారు.

నేటి నుంచి మూడు రోజుల పాటు 'ఓపెన్' 'స్పాట్'

సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. స్థానిక కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకనం కోసం వివిధ జిల్లాల నుంచి హిందీ, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, గణితం, గణితం (ఉర్దూ), ఫిజిక్స్, ఫిజిక్స్ (ఉర్దూ), కెమిస్ట్రీ, కెమిస్ట్రీ (ఉర్దూ), బయాలజీ, బయాలజీ (ఉర్దూ), హిస్టరీ, హిస్టరీ (ఉర్దూ), పొలిటికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ (ఉర్దూ), ఎకనామిక్స్, ఎకనామిక్స్ (ఉర్దూ), కామర్స్, కామర్స్ (ఉర్దూ) సబ్జెక్టులకు సంబంధించి 18,924 జవాబుపత్రాలు వచ్చాయని గోవిందునాయక్ వెల్లడించారు. 175 మందిని ఏఈ, సీఈలుగా నియమించినట్లు పేర్కొన్నారు.

బీజేపీని తరిమికొట్టండి : సీపీఐ రామకృష్ణ

గుంతకల్లు: దేశంలో కులమతాల పేరుతో చిచ్చురేపుతున్న కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ప్రజలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రచార భేరీ యాత్ర బుధవారం గుంతకల్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీరప్ప గుడి సర్కిల్ నుంచి గాంధీచౌక్ వరకూ ఎద్దుల బండిపై ర్యాలీ చేపట్టి మోదీ హఠావో..దేశ్‌కు బచావో అంటూ నినాదాలు చేశారు. అనంతరం గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విద్వేషాలను మోదీ, అమిత్‌షా రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ దేశ ప్రగతిని ఛిన్నాభిన్నం చేసిన బీజేపీకి రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర నాయకులు ఓబుళు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ, మండల కార్యదర్శులు గోపీనాథ్, రాము, సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాల ఖరారు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు కేంద్రాలు ఖరారయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 16 క్రీడాంశాలకు సంబంధించి 50 కోచింగ్ క్యాంపులను నిర్వహించనున్నారు. ఒక్కో శిక్షణ శిబిరానికి ఈ ఏడాది రూ.7 వేలు చొప్పున నిధులు కేటాయించారు. ఈ నిధులతో క్రీడా సామగ్రి, మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రోజూ ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటలకు శిబిరాలను నిర్వహించనున్నారు. ప్రతి శిబిరానికి 20 మంది చొప్పున బాలురు, బాలికలను తప్పనిసరిగా చేర్చుకోవాలనే నిబంధన ఉంచారు.

వ్యక్తి దుర్మరణం

ఉరవకొండ: స్థానిక జాతీయ రహదారిపై చిన్నముష్టూరు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం పెద్దముష్టూరుకు చెందిన లక్ష్మన్న (50) అర్జీలు రాసిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన కుమార్తె సాయిపల్లవితో కలసి ఉరవకొండ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చిన్నముష్టూరు సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకోగానే ఐరన్‌రాడ్‌లతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో లక్ష్మన్న అక్కడి అక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాయిపల్లవిని 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మామ అండ.. అల్లుడి దందా !

- రిజిస్ట్రేషన్ సేవలకు అదనపు బాదుడు..
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు
- ఎస్‌ఆర్ డ్రైవర్/ అల్లుడి నుంచి నగదు స్వాధీనం
- ముందస్తు సమాచారంతో పరారైన సబ్ రిజిస్ట్రార్


సబ్‌రిజిస్ట్రార్ అల్లుడి (ఎడమ నుంచి మొదటి వ్యక్తి) నుంచి నగదు, పత్రాలు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మామ సబ్‌రిజిస్ట్రార్ అండ చూసుకుని అల్లుడు రెచ్చిపోయాడు. రూరల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎవరికైనా రిజిస్ట్రేషన్లు కావాలంటే తనను సంప్రదించాల్సిందే. లేకుంటే ఫైలు ముందుకు కదలదు. డబ్బు అందగానే ఫైలుపై సంతకం.. చకచకా రిజిస్ట్రేషన్ సాఫీగా సాగిపోతాయి. ఇందు కోసం కార్యాలయంలో తనకంటూ ఒక టేబుల్ వేసుకుని.. అధికారిలా పెత్తనం చెలాయిస్తూ వచ్చాడు. ఎట్టకేలకు పాపం పండింది. బాధితుల ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో అడ్డంగా దొరికిపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ శివనారాయణ స్వామి మీడియాకు వెల్లడించారు. అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చలానాలపై అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో దాడి చేశారు. ఆ సమయంలో సబ్ రిజిస్ట్రార్ లేరు. ఓ టేబుల్ వద్ద ప్రైవేట్ వ్యక్తి కొన్ని డాక్యుమెంట్లు పెట్టుకుని..క్రయవిక్రయదారుల నుంచి డబ్బు వసూళ్లు చేస్తూ కనిపించాడు. ఎవరని అధికారులు ఆరా తీయగా అతను సబ్ సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ ఆలీకి వ్యక్తిగత డ్రైవరు, స్వయానా అల్లుడు అయిన షేక్ ఇస్మాయిల్ అని తెలిసింది. ఇక్కడెందుకు కూర్చున్నావని అతడిని అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా అనధికారికంగా దాచుకున్న రూ.2.27 లక్షలు నగదు దొరికింది. తనను తనిఖీ చేస్తున్నా.. నగదు స్వాధీనం చేసుకున్నా ఇస్మాయిల్ ఎటువంటి జంకూ లేకుండా దర్జాగా నవ్వుతుండటం గమనార్హం. అధికారులు ఇంకా పలు రికార్డులను పరిశీలిస్తున్నారు. రిజిస్ట్రేషన్ సేవలకు సంబంధించి అక్రమంగా డబ్బు డిమాండ్ చేస్తే వేటు తప్పదని హెచ్చరించారు. అవినీతి అధికారులు, సిబ్బంది గురించి 14400 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమందించవచ్చని ప్రజలకు సూచించారు.

సిబ్బంది పాత్రపై ఆరా

బుధవారం రిజిస్ట్రేషన్లు ఎన్ని జరిగాయి.. వాటి ఫైళ్లు ఎంత మంది సిబ్బంది సరి చూశారు.. టేబుళ్ల వారీగా ఎవరెవరు ఎంతెంత వసూలు చేశారు..? అన్న దానిపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. సిబ్బంది అందరినీ కార్యాలయంలోనే ఉంచి.. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్కరిని విచారణ చేసి బయటకు పంపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు తేజేశ్వరరావు, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఫైలుకూ లంచమే

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ మహమ్మద్ ఆలీపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇవ్వనిదే ఏ ఫైలు మీదా సంతకం చేయరనే విమర్శలు ఉన్నాయి. ఈయనపై ఏసీబీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు కూడా అందాయి. చివరికి ప్రభుత్వ పథకాల పనులను సైతం మామూళ్లు ఇవ్వనిదే చేయరు. తాజాగా పెళ్లి రిజిస్ట్రేషన్ పత్రాలను కోరినందుకు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ముడుపులు సమర్పించుకోవాల్సి వచ్చిందని కార్యాలయ సిబ్బందే విమర్శిస్తున్నారు.

ముందస్తు సమాచారం అందిందా..?

ఏసీబీ అధికారుల దాడుల సమాచారం రూరల్ సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ ఆలీకి ముందుగానే అందిందా..? అందుకే కార్యాలయం నుంచి ఉన్నపళంగా జారుకున్నారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక ప్రైవేట్ వ్యక్తి వద్దే రూ.లక్షల్లో అనధికారికంగా నగదు దొరకడం చూస్తే కార్యాలయంలో అవినీతి అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అల్లుడు లేనిదే సబ్ రిజిస్ట్రార్ ఎక్కడికీ వెళ్లడని, ఏ పనీ ముందుకు సాగదని పలువురు చెబుతున్నారు. తాను ప్రత్యక్షంగా లేకపోతే కేసు నీరుగారిపోతుందన్న ఆలోచనతోనే సబ్‌రిజిస్ట్రార్ తన కార్యాలయం నుంచి జంప్ అయినట్లు తెలిసింది.

నగదు అపహరణ కేసులో ఇద్దరికి రిమాండ్

యాడికి: నగదు అపహరించుకెళ్లిన కేసులో ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలను యాడికి ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. పెద్దవడుగూరు మండలం కోనాపురం నివాసి మధు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నల్లమేకలపల్లికి చెందిన రజాక్ కూలి పనులతో జీవనం సాగించేవారు. మద్యానికి బానిసైన వీరిద్దరూ యాడికి మండలం రాయలచెరువులోని మద్యం దుకాణం వద్ద ఈ నెల 24న ఉదయం ఒకరికొకరు పరిచయమయ్యారు. ఆ సమయంలోనే సులువుగా డబ్బు సంపాదించేందుకు పథకం రచించి 24న అర్ధరాత్రి యాడికిలోని మోడల్ స్కూల్ వద్ద బళ్లారి నుంచి తమిళనాడుకు ఐరన్ ఓర్ లోడుతో వెళుతున్న లారీని ఆపారు. దుండగుల్లో ఒకరు లారీ డ్రైవర్‌ను శివకుమార్‌ను పట్టుకోగా.. రెండోవాడు కత్తి చూపి చంపుతానని బెదిరిస్తూ రూ.3,230 నగదు లాక్కొని ఉడాయించారు. ఘటనపై 25వ తేదీ ఉదయం యాడికి పోలీసులకు శివకుమార్ ఫిర్యాదు చేశాడు. దీంతో అదే రోజు రాత్రి పోలీసులు నిఘా పెంచారు. అర్ధరాత్రి అనుమానాస్పదంగా రోడ్డుపై తచ్చాడుతున్న మధు, రజాక్‌ను బీట్ కానిస్టేబుళ్లు గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో డ్రైవర్‌ను బెదిరించి నగదు అపహరించుకెళ్లినట్లుగా వారు అంగీకరించారు. దీంతో నిందితులపై బుధవారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

'విద్యార్థుల కోసం కమిషన్ ఏర్పాటు చేయాలి'

రాప్తాడురూరల్: విద్యార్థుల సమస్యలను ప్రభుత్వంతో సమన్వయం చేసేందుకు, సమస్యల పరిష్కారానికి స్టూడెంట్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.చంద్రశేఖర్ యాదవ్ కోరారు. బుధవారం నార్పల పర్యటనలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారికోసం ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



మరూరులో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: ఎన్నో ఏళ్లుగా మరూరు గ్రామంలోని బీసీ కాలనీలో మురుగు నీటి కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు మాచిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ సర్పంచు సాకే వెంకటేష్‌ల ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 20న బీసీ కాలనీలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని నాయకులను కోరారు. విషయాన్ని వారు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మండల గ్రాంటు ద్వారా నిధులు మంజూరు చేయించాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మికి సూచించారు. దీంతో ఆమె డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎంపీపీ నిధులు రూ.4 లక్షల 40 వేలను మంజూరు చేయించారు. దీంతో బుధవారం డ్రైనేజీ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

ముగ్గురికి మెమో

అనంతపురం క్రైం: భవన నిర్మాణ అతిక్రమణలను అడ్డుకోవడంలో విఫలమైన ముగ్గురికి నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి బుధవారం మెమో జారీ చేశారు. కమిషనర్ రమణారెడ్డి రెండ్రోజుల క్రితం నగరంలోని హౌసింగ్ బోర్డులో పర్యటించారు. రాజీవ్‌చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో ఓ నిర్మాణదారుడు కాలువకు ఆనుకుని నిర్మాణం చేపట్టారు. దీనిపై కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి, పట్టణ ప్రణాళిక కార్యదర్శి నరేష్, లైసెన్స్ టెక్నికల్ పర్సన్ షఫీవుల్లాకు మెమో జారీ చేశారు.

ఆక్రమణల తొలగింపు



రెండో రోడ్డులో నిర్మాణాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

అనంతపురం క్రైం: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి బృందం నగరంలోని రెండో రోడ్డులో ఓ నిర్మాణదారుడు పాత్తల గోడపై వేసిన పిల్లర్లను తొలగించారు. సెట్ బ్యాక్స్ ఏర్పాటు చేసుకుని నిర్మాణాలు చేపట్టాలని నిర్మాణదారుడిని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి ఆదేశించారు. అదేవిధంగా భవానీ నగర్‌లో సెట్‌బ్యాక్స్ వదలకుండా చేపడుతున్న నిర్మాణంపై చర్యలు తీసుకున్నారు. భవన నిర్మాణ అనుమతుల్లో పొందుపర్చిన విధంగా నిర్మాణం చేపట్టాలని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వారిని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం ప్యాకెట్లతో పోలీసులు

కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం 27 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. కనగానపల్లి – రామగిరి రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముత్తువకుంట్లకు చెందిన శివయ్య, అతని భార్య గంగమ్మ ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి మద్యం ప్యాకెట్లను సీజ్ చేశామని తెలిపారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో బుధవారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన ఇస్మాయిల్ తన పిల్లలను బైక్‌లో పాఠశాలలో వదిలి పెట్టి తిరిగి ఇంటికి బయలుదేరాడు. అయితే రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయి బైక్‌పై నుంచి కిందపడ్డాడు.

సమస్త విజ్ఞానానికి వేదాలే మూలం



అనుగ్రహ భాషణం చేస్తున్న విద్యాశంకర భారతీ మహాస్వామి



నగరోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జ్వాలాపురం శ్రీకాంత్

- పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి

అనంతపురం కల్చరల్: సమస్త విజ్ఞానానికి వేదాలే మూలమని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి అన్నారు. నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న మొదటిరోడ్డు శ్రీ కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం శతాబ్ది ఉత్సవాలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి పీఠాధిపతి భారతీమహాస్వామి విశిష్ట అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు. ధర్మాచరణ, ధార్మిక కర్మలు, ఆధ్యాత్మిక విధులు తదితర వాటిపై కూలంకషంగా వివరించారు. ఆదిశంకరులు కొలువైన శివాలయం శతాబ్ది ఉత్సవాన్ని జరుపుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సనాతన ఆలయాలను కాపాడుకోవడం అందరి విధి అన్నారు. మనసును కట్టడి చేసుకుంటే దేన్నైనా అవలీలగా సాధించవచ్చని, పిల్లల్లో ధైర్యాన్ని నింపడం, ధర్మం పట్ల అనురక్తి కల్గించడం కోసం తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. అనంతరం స్వామీజీ మహాకుంభాభిషేకం, కలశ పూజలు నిర్వహించి వేడుకలకు ముగింపు పలికారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనానికి తీర్థప్రసాదాలనందించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు హోసూరు రామసుబ్రమణ్యం, ఈఓ రమేష్‌బాబు, విశ్రాంత ఈఓ నాగేంద్రరావు, మాజీ ఆలయ చైర్మన్ జయచంద్రనాయుడు, అనువంశీకులు హోసూరు మల్లికార్జున, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు గర్వకారణం

అనంతపురం కల్చరల్: నగరంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో కాశీవిశ్వేశ్వరాలయం ప్రత్యేకమైనదని, ఆలయానికి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. బుధవారం రాత్రి మొదటిరోడ్డు శివాలయంలో చివరిరోజు జరిగిన నగరోత్సవంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జ్వాలాపురం శ్రీకాంత్, ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రమణ్యం, మల్లికార్జునతో పాటూ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎంతో శ్రమించి ఉత్సవాలను విజయవంతం చేశారని కొనియాడారు. ఆలయం భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం వారిని ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలనందించి సత్కరించారు. కమిటీ సభ్యులు చంద్ర, సుబ్రమణ్యం, తిమ్మారెడ్డి, అర్చకులు నరసింహశాస్త్రి, కిషోర్ తదితరులున్నారు.



వేడుకలను తిలకిస్తున్న భక్తులు

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: ప్రజలకు వినోదాన్ని అందించాలన్న ఉద్దేశంతో అధునాతన హంగులతో కూడిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు ఎఫ్‌కే ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఫకృద్దీన్ పేర్కొన్నారు. బుధవారం రుద్రంపేట సమీపంలో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫకృద్దీన్ మాట్లాడుతూ దేశవిదేశాల నుంచి తెచ్చిన పక్షులు, జంతువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. చిన్న పిల్లల కోసం జాయింట్ వీల్, డక్‌ట్రైన్, కోలంబస్, డ్రాగన్‌ట్రైన్, వాటర్ బోటింగ్ వంటివి ఏర్పాటు చేశామన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన జ్యూవెలరీ ఐటమ్స్, కిచెన్ సామాన్లు, పింగాణీ వస్తువులు అందుబాటులో ఉంచామన్నారు.

క్రీడా కోచ్‌లకు నోటీసులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కోచ్‌లకు నోటీసులను బుధవారం జారీ చేసినట్లు జిల్లా చీఫ్ కోచ్ జగన్నాథరెడ్డి తెలిపారు. క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో ఫెన్సింగ్ క్రీడకు సంబంధించి ఖేలో ఇండియా కోచ్ రవీంద్ర, డీఎస్ఏ కోచ్ ప్రతాప్‌కు నోటీసులను అందించినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశామన్నారు.

కల్యాణం...కమనీయం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో వెలసిన శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. మొదటగా స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



భవ్య, ఆత్మకూరు



ఆయేషా భాను, ఆత్మకూరు

ఆత్మకూరు: ఇంటర్ ఫలితాల్లో స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 24 మంది పరీక్షలు రాయగా 23 మంది ఉత్తీర్ణత సాధించారు. సీఎస్‌ఈలో సింధూకు 479, సౌమ్యలతకు 476 మార్కులు వచ్చాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మొత్తం 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 34 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో భవ్య 956 మార్కులు, శ్రీవాణి 945 మార్కులు సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 69 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఆయేషా భాను 438 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 45 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 19 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో పవన్‌కుమార్ 845 మార్కులు సాధించారు.

రాప్తాడు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బైపీసీ గ్రూపులో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 17 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. వీరిలో మైథిలికు 411 మార్కులు, రమ్యకు 399, సునీతకు 391 మార్కులు వచ్చాయి. రెండో సంవత్సరం ఫలితాల్లో బైపీసీ గ్రూపులో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 30 మంది విద్యార్థులు పాసయ్యారు. జి.శ్రావణికి 932 మార్కులు, ఎస్.మహేశ్వరికి 918 , ఎం.ఐశ్వర్యకు 901 మార్కులు వచ్చాయి.

మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కనగానపల్లి: కనగానపల్లి మోడల్ స్కూల్‌లో 41 మంది విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా 22 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. జాహ్నవి (ఎంపీసీ) 903, యశ్వంతి (బైపీసీ) 890, అంజలి (సీఈసీ) 863 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచినట్లు చెప్పారు. వారిని అధ్యాపకులు అభినందించారు.

మెరిసిన 'ప్రైవేటు' విద్యార్థులు



విద్యార్థిని త్రైథ



ఈశ్వర్‌రెడ్డి



జ్యోత్స్న



విశ్వనాథరెడ్డి



ప్రవీణ్



జింకా వర్ష పద్మశాలి



కామిరెడ్డి చక్రధర్‌రెడ్డి

రాప్తాడురూరల్: ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులు మెరిశారు. తమ పిల్లలు అత్యధిక మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు మురిసిపోయారు. బుధవారం విడుదలైన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో అనంతపురంలోని నారాయణ కళాశాల విద్యార్థిని ఎ.త్రైథ 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. అలాగే కుషాల్ సాయి ఈశ్వర్‌రెడ్డి బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించాడు. అలాగే సీనియర్ ఎంపీసీ విభాగంలో హిందూపురం పట్టణానికి చెందిన జ్యోత్స్న 989 మార్కులు సాధించింది. కె.విశ్వనాథరెడ్డి 989 మార్కులు సాధించాడు. సీనియర్ బైపీసీ విభాగంలో ఏఎస్ ప్రవీణ్ 981 మార్కులు సాధించాడు. శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న ఎంపీసీ సీనియర్ ఇంటర్ విద్యార్థిని పోతిరెడ్డి మానశ్రీ 988 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో జింకా వర్ష పద్మశాలి 463, కామిరెడ్డి చక్రధర్‌రెడ్డి 462 మార్కులు, పటాన్ సామియాతాజ్ 461, పూజారి లోకేశ్వరసాయి 461 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో తోపుదుర్తి సాయిలిషితారెడ్డి 433 మార్కులు సాధించింది. నలంద జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం.ప్రజ్ఞశ్రీ 988 మార్కులు, ఆకాశ్ సుధీంద్ర 981 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో వై.శాంభవి 947 మార్కులు, బైపీసీ విభాగంలో కె.సమత961, వర్షిత 956, చందన 954 మార్కులు సాధించారు. అలాగే జూనియర్ సీఈసీ విభాగంలో లతశ్రీ 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మెరిసింది. నగరంలోని శ్రీమేధా జూనియర్ కళాశాల విద్యార్థులు జూనియర్ ఎంపీసీ విభాగంలో ఎస్.మనోహర్ 458 మార్కులు, ఎంఈసీ విభాగంలో జి.నేహశ్రీ 472 మార్కులు, సీఈసీ విభాగంలో ఎస్.మాధవి 446 మార్కులు సాధించింది. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు. పలు చోట్ల కేక్ కట్ కేసి ఆనందం పంచుకున్నారు. భవిష్యత్తులోనూ అన్ని పరీక్షల్లో రాణించాలని ఆకాంక్షించారు.

సీఎంకు స్వాగతం

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నార్పలలో హెలీప్యాడ్ వద్ద అనంతపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, తదితరులను ఎమ్మెల్యే అనంత సీఎం జగన్‌కు పరిచయం చేశారు.





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న నదీం అహ్మద్, మేయర్ వసీం







ముఖ్యమంత్రి జగన్‌తో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పుష్పగుచ్ఛం అందిస్తున్న అహుడా చైర్పర్సన్ మహాలక్ష్మి శ్రీనివాస్



వైఎస్సార్ సీపీ నేత అనంత చంద్రారెడ్డి



సీఎంతో ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, పెన్నోబిలేసు



రాప్తాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి

రేపటి నుంచి అక్కమ్మగార్ల పరుష

ఆత్మకూరు: ఆత్మకూరు శ్రీదేవలతోటలో వెలసిన తిరుగడ అక్కమ్మ గార్ల పరుష ఉత్సవాలు 28 నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 28న పూవు కొండకు పోవడం, 30న రాత్రి చెరుకుగడలకు పోవడం, మే 1న చెరుకుగడలను తెచ్చి జల్ది పూజ నిర్వహిస్తామన్నారు. అలాగే 2న ఉదయం అమ్మవారికి జల్దితో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం అమ్మవారిని జల్ది నుంచి గుడికి తెచ్చే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. 3న పరుష , పన్నారపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పడం, 4న కొండమరాయుడు పూజా కార్యక్రమం, కుంకాలాడుట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

3న రాతిదూలం పోటీలు

అక్కమ్మదేవత పరుష ఉత్సవాల్లో భాగంగా 3న రాష్ట్రస్థాయి దేశవు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలిచిన వృషభాల యజమానులకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 9701094040, 8919422008 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



ప్రత్యేక అలంకరణలో అక్కమ్మ గార్లు

'వికేంద్రీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి'

అనంతపురం: అసెంబ్లీలో నూతన వికేంద్రీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించారు. నార్పలలో బుధవారం సీఎంను ఆయన కలిశారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానుల ఏర్పాటు చట్టం–2020 జనవరిలో చేశారన్నారు. రాజధాని వికేంద్రీకరణ దృష్ట్యా ఇటీవల జరుగుతున్న పరిణామాలతో ఆశలు అడియాసలు అయినట్లు అనిపిస్తోందని వాపోయారు. తక్షణమే నూతన పాలన వికేంద్రీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు.

గాలీవాన బీభత్సం

శెట్టూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన గాలీవానకు పలు పంటలు దెబ్బతిన్నాయి. ఐదుకల్లు గ్రామంలో లింగప్పకు చెందిన ఐదెకరాల్లో సాగు చేసిన బొప్పాయి నేలకొరిగింది. చెట్లు నేలకూలడంతో కాయలు రాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. అలాగే శెట్టూరు, యాటకల్లు, కనుకూరు గ్రామాల్లో

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గాయపడిన పవన్‌కుమార్

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి రైలు ఇంజిన్ కు ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. యూపికి చెందిన పవన్ కుమార్ తన భార్య బెంగళూరులో ఉండటంతో ఆమెను కలవడానికి వెళ్లాడు. అయితే ఆమె అతనితో రావడానికి నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ ఎలహంక టూ కాచిగూడ రైల్లో తిరుగు ప్రయాణమయ్యాడు. అయితే గుత్తి రైల్వే స్టేసన్‌లో రైలు ఆగిన సమయంలో ఇంజిన్‌కు ఉన్న విద్యుత్ వైరు పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రమాదంలో పవన్‌కుమార్ శరీరం సుమారు 40 దాకా శాతం కాలిపోయింది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు తదితరులు పవన్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు.